పింగళి వెంకయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్
జాతీయ పతాకా రూప శిల్పి పింగళి వెంకయ్యకు కేఎస్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఘన నివాళి అర్పించారు. ఆయన చిత్ర పటానికి పూల హారం వేసి ఆయన గొప్ప తనాన్ని శ్లాఘించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి రత్నమ్మ ఆయన మన తెలుగు వారు కావడం గర్వకారణం అన్నారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి ఆర్ జాన్ దేవానంద్ మాట్లాడుతూ వెంకయ్య దక్కాల్సిన గౌరవం దక్కలేదని, ఆయన స్వాతంత్ర సమరయోధుడు అని తెలిపారు. భారత జాతికి ఒక పతాకం లేకపోవడం ఆయనకు బాధ కలిగించి, మనకంటూ ఒక పతాకం ఉండాలని తలంచి మువ్వన్నెల జెండాను రూప కల్పన చేశారని చెప్పారు. విద్యార్థినులు ఆయన జీవిత విశేషాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులను పట్ల కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వర, మేనేజింగ్ ఎండి డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఓడిలు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్మార్ట్'గా బిగిస్తున్నారు..!

- రీఛార్జ్ చెయ్.. స్విచ్ వెయ్..
- స్మార్ట్ మీటర్ల బిగింపుతో వినియోగదారుల జేబులకు చిల్లు
- ఇప్పటికే 2 వేలకు పైగా ఏర్పాటు
- తొలుత కమర్షియల్‌పై దృష్టి, నెమ్మదిగా ప్రతి ఇంటికీ

దుకాణాలకు స్మార్ట్ మీటర్ బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పులివెందుల టౌన్
రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు వేగంగా అమలవుతున్నాయి. గత ఎన్నికల్లో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా రకాల ఛార్జీల పేరుతో వినియోగదారులపై పెనుభారం మోపింది. అసలే పెరిగిన ఛార్జీలతో సతమతమవుతున్న ప్రజల నెత్తిన మరో పెద్ద భారం మోపేందుకు చర్యలు తీసుకుంది. స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలను దోపిడీ చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్రంలో స్మార్ట్‌మీటర్ల బిగింపును ఆదాని సంస్థ దుకాణాలకు బిగించింది. భారీ మొత్తంలో ఛార్జీలను వసూలు చేస్తోంది. అది చాలదన్నట్లు ఇప్పుడు గృహాలకు బిగించేందుకు సన్నాహాలు చేస్తోంది. రీ ఛార్జ్ చెయ్.. స్విచ్ వెయ్ అనే విధంగా ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు జిల్లాలో చురుగ్గా సాగుతోంది. తొలుత కమర్షియల్ షాపింగ్ మాల్స్, దుకాణాలు, కుటీర పరిశ్రమలపై విద్యుత్ శాఖ దృష్టి కేంద్రీకరించింది. ఆపై రూ.2 వేలు పైబడి విద్యుత్ బిల్లు వచ్చే ఇళ్లకు సైతం ఆదానీ మీటర్లు బిగించనున్నారు. ఆపై ప్రతి ఇంటికీ ఈ మీటర్లు వచ్చేస్తాయని ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులు పేర్కొంటున్నారు. పట్టణంలో ఇప్పటికే 2వేలకు పైగా స్మార్ట్ మీటర్లు బిగించినట్లు విద్యుత్ శాఖ ఎఇ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. నివాస గృహాలకు ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆ మేరకు ఆదేశాలుజారీ అయ్యాయి. గత ప్రభుత్వంలోనే ఈ మీటర్లు అమలులోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం వాటిని కొనసాగిస్తోంది. దశల వారీగా ఈ మీటర్లను విస్తరింప చేస్తున్నారు. మొదట వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. త్వరలో రూ.2 వేలకు పైగా విద్యుత్ వినియోగించే మీటర్లను మార్చనున్నారు. దశల వారీగా ప్రతి మీటరూ స్మార్ట్ మీటర్‌గా మారుతుంది. ఎంత విద్యుత్ వినియోగించుకుంటే అంతే బిల్లు చెల్లించే విధంగా ఈ మీటర్లు పని చేస్తాయని ఒక వైపు అధికారులు పేర్కొంటున్నారు. పైగా ప్రస్తుతం విధిస్తున్న అదనపు ఛార్జీలు ఉండబోవని చెబుతున్నారు. వాస్తవానికి ఈ మీటర్లకు ప్రీపెయిడ్ పద్ధతిలో రీఛార్జ్ చేసుకోవాలి. ఒక వేళ మనం చేయించుకోకపోతే విద్యుత్ కట్ అవుతుంది.

ప్రస్తుతం పాత పద్ధతిలోనే బిల్లుల వసూలు..
ఇప్పటికే 2 వేలకు పైగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశామని ఏఈ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ మీటర్లు ద్వారా ప్రస్తుతం పాత విధానంలోనే బిల్లులు వసూలు చేస్తున్నామని చెప్పారు. ఇంకా పోస్ట్ పెయిడ్ విధానం అమలు చేయడం లేదన్నారు. ఈ స్మార్ట్ మీటర్ల వల్ల బిల్లులు వారి సెల్ ఫోన్‌లకు మెసేజ్ రూపంలో వస్తాయని ఆ మొత్తం ఆన్ లైన్‌లో చెల్లిస్తే సరిపోతుందన్నారు. బిల్లులు చెల్లించకపోతే వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆయన చెప్పారు. ఈ మీటర్ల వల్ల పేద, మధ్య తరగతికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, పథకాలు రద్దు కాబోవని చెప్పారు. స్మార్ట్ మీటర్లు వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగానికి సంబంధించి సిబ్బంది ప్రతి నెల వచ్చి రీడింగ్ తీయాల్సిన అవసరం ఉండదు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఆన్‌లైన్ ద్వారా మానిటరింగ్ కేంద్రానికి మీటర్ రీడింగ్ చేరుతుంది. ఎన్ని యూనిట్లు వాడారు? ఎంత బిల్లు చెల్లించాలి? అన్న వివరాలు సంబంధిత వినియోగదారుని మొబైల్ ఫోన్‌కు మెసేజ్ ద్వారా వస్తుంది. కాకపోతే గడువులోగా బిల్లు చెల్లించకపోతే మానిటరింగ్ కేంద్రం నుంచే స్మార్ట్ మీటర్ ద్వారా విద్యుత్ సరఫరాను నిలిపివేసే అవకాశం ఉంటుంది. లైన్‌మేన్ ఇళ్లకు వచ్చి ఫ్యూజులు తీసుకెళ్లాల్సిన విధానం ఉండదు. అలాగే ఒకవేళ ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఎక్కడ, ఎందుకు నిలిచిపోయిందో స్మార్ట్ మీటర్ ద్వారా వెంటనే మానిటరింగ్ కేంద్రానికి సంకేతాలు వస్తాయి. వినియోగదారుడు ఫిర్యాదు చేయకుండానే సిబ్బంది నేరుగా అక్కడకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు.

ప్రభుత్వ కార్యాలయాలకు పెద్ద చిక్కే..
ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ బిల్లుల చెల్లింపు సక్రమంగా జరగడం లేదు. బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ పలు సందర్భాల్లో విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సరఫరాను నిలిపివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి తరుణంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే కచ్చితంగా ముందస్తుగా రీఛార్జ్ చేయించుకోవాల్సి ఉంటుంది. వాడిన తర్వాత బిల్లు కట్టడమే కష్టంగా ఉన్న తరుణంలో ముందస్తుగా కార్యాలయాలు రీఛార్జి చేయించడం అంటే గగనమే అనుకోవాలి. ముందస్తు రీఛార్జి చేయించకపోతే కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. తద్వారా ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

రీఛార్జ్ చేయకుంటే విద్యుత్ కట్
స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అయితే వినియోగం తర్వాత బిల్లు చెల్లించే విధానం రద్దు అవుతుంది. సెల్ ఫోన్లు మాదిరి వినియోగించే ముందే ముందస్తుగా రీఛార్జీ చేయించుకోవాలి. నెలలో ఎంత విద్యుత్ వినియోగం అవసరం అవుతుందో దానికి బట్టి ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాలి. రీఛార్జ్ మొత్తం పూర్తవగానే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

స్మార్ట్ మీటర్లతో అదనపు బిల్లు
స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల రూ.370 బిల్లు అదనంగా వచ్చింది. పాత మీటర్లు ఉన్నప్పుడు రూ. 810 బిల్లు వస్తే ప్రస్తుతం రూ. 1180 బిల్లు వచ్చింది. ఈ మీటర్ల వల్ల అదనపు భారం పడుతుంది.
- ఓబులేసు, టైలర్, పులివెందుల

ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై నిర్లక్ష్యమేల? : ఫ్యాప్టో

ప్రజాశక్తి- కడప అర్బన్
ఒకప్పుడు ఉపాధ్యాయుడు అంటే విద్యార్థులకు జ్ఞానాన్ని అందించేవాడని, ప్రస్తుతం ఉపాధ్యాయుడు అంటే రికార్డులు నిర్వహిస్తూ, రిపోర్టులు పంపే వ్యక్తిగా భావిస్తున్నారని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు మల్లు రఘునాథరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ ఆరోపించారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో చైర్మన్ ఎస్ఎండి ఇలియాస్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధించే పరిస్థితి లేదని, బోధనేతర కార్యక్రమాలు, ఉన్నతాధికారులకు నివేదికలు పంపటంలో బోధనా సమయం హరించుకుపోతుందన్నారు. 27 సంవత్సరాలుగా ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడంతో దొడ్డిదారిన ప్రభుత్వ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్లకు ఎంఇఒ-1 ఎఫ్.సి బాధ్యతలు అప్పగిస్తున్నారన్నారు వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించి 2 నెలలు గడుస్తున్నప్పటికీ పొజిషన్ ఐడిల సమస్య పరిష్కరించలేకపోవడం వల్ల ఉపాధ్యాయులు జీతాలు పొందలేని పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలకు ముందు ఘనంగా మేనిఫెస్టోను ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పిఆర్‌సి, మధ్యంతర భృతి, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు, సిపిఎస్ అంశం, కేంద్ర ప్రభుత్వ 57 మెమో అమలుపై హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలైనా ఏ ఒక్క అంశాన్ని అమలు చేయలేదన్నారు. పది నెలలుగా ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లింపు, చనిపోయిన ఉద్యోగులకు అంత్యక్రియల ఖర్చులు కూడా చెల్లించలేకపోవడం అమానుషమన్నారు. విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలని చెబుతున్న ప్రభుత్వం అందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్య పూరితంగా ఉందన్నారు. ఎంఇఒల బదిలీలు, బదిలీలలో రిలీవింగ్, పురపాలక ఉపాధ్యాయులకు జిపిఎఫ్ అమలు సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫ్యాప్టో మాజీ చైర్మన్ జీవీ నారాయణరెడ్డి, ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు సురేష్ బాబు, శ్యాంసుందర్ రెడ్డి, సయ్యద్ ఇక్బాల్, మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి దిగి రాకపోతే సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ కార్యక్రమాన్ని ఈనెల 12న చేపడతామని తెలిపారు. ధర్నా అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఒకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ అబ్దుల్లా, జిల్లా నాయకులు ఎన్.సంగమేశ్వర్ రెడ్డి (ఎస్‌టియు),మాదన విజయకుమార్ (యుటిఎఫ్), వి.వి శ్రీనివాసు రెడ్డి వెంకట సుబ్బారెడ్డి, సాజిత్ ఎం.జుబేర్ అహ్మద్, హరి కొండయ్య, వి.శ్యామలాదేవి, అధిక సంఖ్యలో ఫ్యాప్టో నాయకులు కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ

రైతు ఆలోచన విధానంలో మార్పు రావాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్నకలెక్టర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)
సాగు, ఉత్పత్తి, మార్కెట్ విషయాల్లో రైతుల ఆలోచన విధానంలో మార్పు రావాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజుపల్లెలో అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం మొదటి విడత నిధుల చెక్కును ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటలను ఇవాళ పండించడం కష్టం కాదని, పండించిన పంటను మార్కెట్ చేసుకోవడం రైతు తెలివి తేటల మీద ఆధారపడి ఉందని చెప్పారు. రైతులకు సపోర్టుగా అగ్రికల్చర్, హార్టికల్చర్ శాఖలు, తాను ఉన్నామని భరోసా ఇచ్చారు. ఎగుమతి విధానంలో పంటలు పండించాలని తెలియజేశారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో మరొక హామీని కూటమి ప్రభుత్వం విజయవంతంగా నెరవేర్చిందన్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5000 కేంద్ర వాటా కింద ఒక్కో రైతుకు రూ.2 వేలు ప్రొద్దుటూరు నియోజక వర్గంలో మొత్తం 10,326 మంది రైతులకు రూ. 7 కోట్ల 10 లక్షల నిధులు విడుదల చేశార్నారు. రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు అందిస్తున్నామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే రైతన్నల అభ్యున్నతికే పాటుపడుతుందని చెప్పారు. రైతుల కోసం ఉచిత విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధరలు వంటి అన్నదాతల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, ప్రొద్దుటూరు మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి, మాజీ జడ్‌పిటిసి సభ్యులు తోట మహేశ్వర్‌రెడ్డి, లింగాపురం ఎజిఆర్ బ్యాంకు చైర్మన్ సిద్ధారెడ్డి నాగమునిరెడ్డి, ఎడిఎ అనిత, తహశీల్దార్ గంగయ్య, మండల వ్యవసాయ అధికారి వరహరి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, సర్పంచ్ రాజువారి ఆదిలక్షుమ్మ, సింగల్ విండో మాజీ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, వ్యవసాయ అధికారులు ,రైతులు, గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

'బళ్లారి' కళాప్రపూర్ణుడు

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగు నాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన మానవతా కళాప్రపూర్ణుడు బళ్లారి రాఘవ అని, ప్రతి ఒక్కరికీ ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని జివిఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ నీలమయ్య అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో స్టెప్, జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బళ్ళారి రాఘవ 145 జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటక రంగానికి ఎనలేని కృషి చేశారన్నారు. రాఘవ బాల్యం, విద్యాభ్యాసం బళ్లారి పట్టణంలో గడిచిందన్నారు. చిన్నతనం నుంచి కళలపై మక్కువ చూపించారన్నారు. 12 ఏట నుంచి నాటకాలలో నటించి బళ్లారిలో షేక్స్పియర్ క్లబ్ స్థాపించి ఆంగ్ల నాటకాలను ప్రదర్శించారని పేర్కొన్నారు. ఆయన ఎక్కువగా సామాజిక నాటకాలను ప్రోత్సహించి సమాజంలో ఉన్న అసమానతలు, రుగ్మ తలపై ప్రదర్శనలు నిర్వహించి నాటక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాంతమ్మ, స్టెప్ సిఇఒ సాయి గ్రేస్, ఎల్‌డిఎం జనార్ధన, జిల్లా టూరి జం మేనేజర్ రామ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతు అనుకూల ప్రభుత్వం కాదు

ప్రజాశక్తి - కడప : ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతు అనుకూల ప్రభుత్వం కాదని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విమర్శించారు. శనివారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చారన్నారు. ఎన్నికల ముందు కేంద్రం ఇచ్చేది కాకుండా మరో 20,000 ఇస్తామని చంద్రబాబు నాయుడు చెప్పి ఇప్పుడు కేంద్రం ఇచ్చే సొమ్ముతోనే సరిపెట్టుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువులు, పురుగు మందుల ధర ఆకాశాన్నంటుతున్నాయన్నారు. అన్నం పెట్టే అన్నదాతలకైనా న్యా యం చేయాలని సూచించారు. పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికల్లో వైసి పితో టిడిపి పోటీచేయడం లేదని, పోలీసుల చేస్తున్నారని పేర్కొ న్నారు. ధర్మానికి, ప్రజాస్వామ్యానికి బద్ధులమై ఎన్నికల్లో పాల్గొంటామన్నారు.

ఎపిఎల్-25కు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి - కడప : ఈనెల 8 నుంచి విశాఖపట్నంలో నిర్వహించబోయే ఎపిఎల్ -25 మ్యాచ్‌లకు కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ నుండి 11 మంది క్రీడాకారులు ఎంపిక కావడం హర్షనీయం అని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్ రెడ్డి, కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, డిసిఒ ఖాజా మైనుద్దీన్ పేర్కొన్నారు. జరగబోవు అన్ని మ్యాచ్‌లు బాగా ఆడాలని సూచించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరపున 11 మంది క్రీడాకారులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. 11 మంది క్రీడాకారుల్లో హరి శంకర్ రెడ్డి, టి.వంశీకృష్ణ, షేక్ జహీర్ అబ్బాస్, ఎస్ ఎం డి రఫీ, దూర్వా కుమార్ రెడ్డి, ఎం. వాసు దేవ రాజు, కె. సుదర్శన్, 8. సి.వరుణ్ తేజా రెడ్డి, ఎ. ఆర్జిత్, టి. ధీరజ్‌రెడ్డి, ఎం ధనుష్ ఉన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

ప్రజాశక్తి - కడప : కడప నగరం పులివెందుల బైపాస్ రోడ్డు రియాజ్ థియేటర్ ఎంపిపి స్కూల్ వద్ద స్పీడుబ్రేకర్ వేయాలని కోరుతూ శనివారం ఆర్ అండ్ బి సర్కిల్ ఆఫీస్ కడప ఇఇకి బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తంఅంజి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి స్పీడ్ బ్రేకర్ లేనందున అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు వేలాది మంది పబ్లిక్ వెహికల్స్ అక్కడ తిరుగుతుంటాయని, స్పీడ్ బ్రేకర్ లేనందున పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో కె. లక్షమయ్య, పి శ్రీను, పెద్దగంగులు, ఎం. వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ భారం తగ్గించకపోతే ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె
కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. శనవారం కరపత్రాలు శనివారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని వారు తీవ్రంగా విమర్శించారు. రోజు వారీ డిమాండ్‌ను బట్టి ఛార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఇఆర్‌సి అనుమతించడం దారుణమని ఆయన అన్నారు. సోలార్ విద్యుత్తు యూనిట్ రూ. 1.99 కి టెండర్లు పడిన రోజుల్లో సెకితో రూ. 2.49 కు కొంటామని ఒప్పందం చేసుకోవడం సరైంది కాదని చెప్పారు. ఒప్పందం చేసుకోవడాన్ని తొలి నుండి వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సెకితో ఒప్పందం వల్ల 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని ఇది మోయలేని భారం అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమర్చే కాంట్రాక్ట్‌ను అదానికి కట్ట పెట్టారని విమర్శించారు. ఈనెల 5న విద్యుత్ భవన్ ఎదుట నిర్వహించే ఆందోళనను ఆందోళన జయప్రదం చేయాలని కోకారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ. గోపాలకృష్ణయ్య, మండల రైతు సంఘం నాయకులు చిన్న సిద్దయ్య, శ్రీనివాసులురెడ్డి, బాషా, రమణ, బంకు సిద్దయ్య, రైతులు పాల్గొన్నారు.

భూ పంపిణీ అమలు చేయాలి : వ్య.కా.స

ప్రజాశక్తి - కడప అర్బన్
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ పేదలకు భూ పంపిణీ అమలు చేయాలని, ప్రాజెక్టుల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాలని, పారిశ్రామిక అభివృద్ధి చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అన్వేష్ పేర్కొన్నారు. ఈనెల 3న రాష్ట్ర సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెమినార్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. శనివారం ఉదయం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పేదల వలసలు నివారించడానికి భూ పంపిణీ అమలు చేయడంలో వైసిపి, టిడిపి ప్రభుత్వాలు చాలా నిర్లక్ష్యం వహించాయన్నారు. 12 సంవత్సరాల నుంచి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఒక ఎకరం పేదవారికి పంపిణీ నోచుకోలేదన్నారు. పాలకులు రాజకీయ పలుకుబడి కలిగిన వారు మాత్రం ప్రభుత్వ భూములను యదేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధులు భూ కబ్జాదాలకు సహకరిస్తున్నారన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు బ్రహ్మ సాగర్, హంద్రీనీవా, గండికోట ప్రాజెక్టులు ద్వారా రైతుల పొలాలకు పంట కాలువలు నిర్మించడంలో పరిపాలించిన పార్టీలు శ్రద్ధ పెట్టడం లేదన్నారు. రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.మధు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ప్రకటన హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

సుంకర రామచంద్రుడు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జమ్మలమడుగు పర్యటనలో భాగంగా చేనేత కార్మికుల కష్టాలను పరిశీలించి చేతి మగ్గాలతో నేసేవారికి 200 యూనిట్లు విద్యుత్తును ఉచితంగా అందించడం, పవర్లూమ్ మగ్గాల వారికి 500 యూనిట్లు ఉచితంగా అందజేయడం హర్షణీయమని చేనేత ఐక్యవేదిక సంయుక్త కార్యదర్శి సుంకర రామచంద్రుడు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ జిల్లాలో చేనేత కుటుంబాలు మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ముందుకు వెళుతూ ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్మికుల కష్టాలను వారి ఇళ్ల వద్దకు వెళ్లి కళ్ళారా చూసి విద్యుత్ రాయితీ ప్రకటించడం గొప్ప విషయమని చెప్పారు. వేలాది కుటుంబాలను ఆదుకున్నారని పేర్కొన్నారు. విద్యుత్ రాయితీ వల్ల చేనేత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునే పరిస్థితులు కొంతవరకైనా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని కూడా తొలగించడం హర్షణీయమన్నారు.

పకడ్బందీగా జడ్‌పిటిసి ఉప ఎన్నికలు : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్
పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాల్‌లో ఉప ఎన్నికల నిర్వహణపై జడ్‌పి సిఇఒ ఓబులమ్మతో కలిసి డిఆర్‌ఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉప ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో పాటు ఓటర్లు, సాధారణ ప్రజానీకం అందరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను పక్కాగా పాటించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పులివెందల రెవిన్యూ డివిజన్, కడప రెవెన్యూ డివిజన్ అంతట అమలులో ఉంటుందని తెలిపారు. సెన్సిటివ్, క్రిటికల్, వల్నరబిలిటీ పోలీస్ స్టేషన్లను గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులకు విధులను కేటాయిం చారన్నారు. పులివెందుల ఆర్‌ఒగా నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఒంటిమిట్ట ఆర్‌ఒగా డిప్యూటీ కలెక్టర్ రిమ్స్ రంగస్వామిని నియమించారన్నారు. జులై 30 నుంచి ఆగస్టు 1వ తేదీ సాయింత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించామన్నారు. పులివెందుల స్థానానికి సంబంధించి 12 నామినేషన్లు, ఒంటిమిట్ట స్థానానికి సంబంధించి 21 నామినేషన్లు వచ్చాయన్నారు. శనివారం నామినేషన్ పత్రాల పరిశీలించామని పేర్కొన్నారు. ఆగస్టు 3న సాయంత్రం 5 గంటల వరకు తిరస్కరణకు గురైన వాటిపై అప్పీలేట్ అధికారికి ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 5న మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తామన్నారు. పులివెందులలో 15 పోలింగ్ స్టేషన్లు 10, 601 ఓటర్లు, ఒంటిమిట్టలో 30 పోలింగ్ స్టేషన్లు 24,606 ఓటర్లున్నారని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన
మహాత్మా గాంధీ యూత్ స్టడీ హాల్ విద్యార్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్

స్టడీ సర్కిల్ ప్రారంభంలో సూర్య సాయి ప్రవీణ్ చంద్, మణికంఠ (ఫైల్ ఫొటో)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాలలో కడప నెహ్రూ యువ కేంద్ర (మైభారత్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ యూత్ స్టడీ హాల్ లోని 22 మంది యువత కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి బి.ప్రదీప్ కుమార్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2023వ సంవత్సర లో పూర్వపు కడప మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, పూర్వపు జిల్లా యువ అధికారి మణికంఠ సంయుక్త ఆధ్వర్యంలో స్టడీ హాల్ ఎంతోమంది యువతకు వారి కలలను సహకారం చేసుకునేందుకు, మంచి వాతావరణం లో చదువుకోవడానికి అనుకూలంగా అతి తక్కువ ఫీజుతో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్న యువతకు చక్కటి సహకారం స్ఫూర్తి నిచ్చిందని పేర్కొన్నారు. కావవలసిన పుస్తకాలు అందజేస్తున్న తమ విజయానికి తోడ్పాటు నిచ్చిన నెహ్రూ యువ కేంద్ర వారికీ ఉద్యోగం సాధించిన వారు ప్రతేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారన్నారు. భవిష్యత్‌లో కూడా అనేక మంది యువత ఈ స్టడీ హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దేవేందర్ రెడ్డి, అంకిరెడ్డి, సాయిరాం, నాగార్జున ,కృష్ణ నాయక్, శ్రీను నాయక్, కిరణ్ మల్లికార్జున, ఉదయ్ కుమార్, భరత్,సుధీర్ రామాంజి నాయక్, మధుమోహన్, మాధవ్, జయచంద్ర,నరేంద్ర, శ్రీనివాసులు సురేష్, దిలీప్, సాగర్, చంద్రశేఖర్, హాఫీజున్ ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు వరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ నాగరాజు

తల్లిపాలు బిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన వరమని డిఎంహెచ్ఒ నాగరాజు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో తల్లిపాల ప్రాముఖ్యత, అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. . జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి విచ్చేసి తల్లిపాల విశిష్టత గురించి విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ చాలామంది అవగాహనా లోపంతో కాన్పులనిమిత్తం ప్రయివేట్ వైద్యశాలలను ఆశ్రయించడంతో అక్కడ అధికభాగం శస్త్రచికిత్స ద్వారా ప్రసవాలను చేయడం వల్ల బిడ్డకు మొదటి గంటలోపే ముర్రుపాలు తాగించే అవకాశం లేకుండా పోతోందని పేర్కొన్నారు. కనుక ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులకు మొగ్గుచూపడం ద్వారా సహజ సుఖ ప్రసవాలను పొడటమేకాక ముర్రుపాలు బిడ్డకు అందించే అవకాశం ఉంటుందని తెలియజేశారు. డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎక్కువమార్లు తాగించడం వల్ల తల్లి కాన్పు సంబంధమైన అస్వస్తత నుండి సత్వరమే కోలుకోవడమేగాక ఎక్కువకాలం తాగించడం వల్ల బిడ్డకు తల్లికి మధ్య అనుబంధం బలపడుతుందని తెలియచేశారు. రమాదేవి మాట్లాడుతూ తల్లిపాలు తాగిచడంవల్ల తల్లికి సంబంధిత హార్మోన్ల ప్రభావం చురుకుగా ఉండి స్త్రీ సంబంధ వ్యాధులు, కేన్సర్ లాంటి వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర హోమియో వైద్యులు డాక్టర్ కవిత, డిప్యూటీ డెమో రమణమ్మ, డిప్యూటీ హెచ్ఇఒ కుమారి, అంగన్వాడీ పర్యవేక్షకులు శ్రీదేవి, ఇతర వైద్య ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సిఐటియు సమావేశం

ప్రజాశక్తి కడప అర్బన్ : యుటిఎఫ్ కార్యాలయంలో ఈనెల 3న సిఐటియు ముఖ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి. నాగేశ్వరరావు హాజరవుతున్నట్లు సిఐటియు తెలిపారు. ఆల్ ఇండియా మహాసభలు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం మొదటి సారన్నారు. ఈ మహాసభలు డిసెంబర్ 31, 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో ఉంటాయని చెప్పారు. చివరి రోజు విశాఖపట్నంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు దేశంలోనే ముఖ్యమైన నాయకత్వం హాజరవుతున్నారన్నారు. ఈ తరుణంలో యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో మధ్యతరగతి ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

GITAMW SINCE 2009
GOUTHAMI
B++ NAAC
ISO 9001:2015 CERTIFIED
INSTITUTE OF TECHNOLOGY & MANAGEMENT FOR WOMEN (AUTONOMOUS)
(Approved by AICTE, New Delhi, SBTET, AP & Affilate to JNTUA)
Sai Nagar, Peddasettypalli (V), Proddatur, Kadapa(D.t), A.P.
gitamwpdtr@gmail.com, Cell: 9848349885, 9849570557, 9642076632.
SPOT ADMISSIONS FOR POLYTECHNIC (AP POLYCET-2025)
COURSES : DCME, DEEE, DECE
Interested candidates can attend the Spot Admissions along with original certificates and required fee on 05-08-2025 in the college premises, Admissions will be made as per guidelines given by Convener, AP POLYCET-2025.
- PRINCIPAL

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డిఎస్‌పి మురళీనాయక్

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల జడ్‌పిటిసి ఉపఎన్నిక నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాలను పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ పరిశీలించారు. మండల పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించి, ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి కేంద్రాల వద్ద కావలసిన భద్రత గురించి సమీక్షించారు. అనంతరం డిఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ ఎస్‌పి ఈజి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఉప ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను, భద్రత ఏర్పాట్లు చేయడం కోసం పరిశీలించామన్నారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులతో కలిసి పోతామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ చాంద్ బాషా, రూరల్ సిఐ వెంకటరమణ, ఎస్‌ఐలు నారాయణ, విష్ణు నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్- 31, కెమికల్ ఇంజనీరింగ్-17, కంప్యూటర్, ఇంటర్నెట్ అఫ్ థింగ్స్-26, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-32, మెకానికల్ ఇంజనీరింగ్-29, మెటలర్జికల్ ఇంజనీరింగ్-33 కోర్సులలో సీట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. డిప్లమా సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేస్తున్నామన్నారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్ష రాయకున్నా అర్హులే అని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వారి ఎస్‌ఎస్‌సి సర్టిఫికేట్, టిసి, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, 4వ తరగతి నుండి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్, ఒరిజినల్ ధృవపత్రాలతోపాటు రెండుసెట్ల జెరాక్స్ కాపీలతో స్వయంగా సంప్రదించాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- వైసిపి మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శి శివ

ప్రజాశక్తి -ఎర్రగుంట్ల

వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని ఆ పారీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మాడిశెట్టి శివకుమార్ పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం తనను నియమించినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనకు పార్టీలో పదవి ఇచ్చారని తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ తనకు అప్పజెప్పిన బాధ్యతలను నెరవేరుస్తానని తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేస్తూ న్యాయం చేస్తానని పేర్కొన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే దిశగా మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కృషి చేస్తానని పేర్కొన్నారు. తమకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించానని తెలిపారు. తాను ఎప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నానని వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని శివ ఘనంగా సన్మానించారు.

విద్యుత్ కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గత వైసిపి ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వమైన న్యాయం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు తెలిపారు. శనివారం సిఐటియు మండల కార్యదర్శి విజయ్ ఆధ్వర్యంలో జమ్మలమడుగు 132కెవి సబ్ స్టేషన్‌లో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈనెల 7న విజయవాడలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోడ పత్రలు విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు విజయ్, యునైటెడే ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సబ్ డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, విద్యుత్ కార్మికులు ఓబులేసు, శ్రీనాథ్‌రెడ్డి, దస్తగిరి, రమణ, రాము, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ. నాయక్, శివ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు న్యాయం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ నాయక్ రసూల్ కోరారు. శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ఈనెల 7న విజయవాడలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోడ పత్రాలు విడుదల చేశారు. అనంతరం విద్యుత్ అధికారి రమణారెడ్డికి, ప్రొద్దుటూరు అర్బన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డికి, రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శిరీషకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సేలం సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షులు నాగసుబ్బయ్య, ప్రొద్దుటూరు నాయకులు షరీఫ్, సబ్ డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ విక్టర్, మీటర్ రీడర్ల సంఘం జిల్లా నాయకులు బాలసుబ్బయ్య, విద్యుత్ కార్మికులు రమణ, రాము, కుల్లాయప్ప పాల్గొన్నారు.

పది మందికి సిఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం మండలానికి చెందిన 10 మందికి ముఖ్యమంత్రి సహాయనిధిని రూ.4,83,523 చెక్కులను మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి శనివారం పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి సహకారంతో పెట్టిన ప్రతి ఒక్కరికీ ఇస్తున్నారని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనేది అక్షరాల నిజమైందని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మోరగుడిలో శనివారం ఆయన ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్ మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని ప్రజలను మోసం చేశారన్నారు. దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని సంవత్సరం దాటిన కూడా మూడు సిలిండర్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. తాము అధికారంలో ఉన్నపుడు పార్టీ బేధాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు, పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అని ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలు గమనించాలని, వాటిని గుర్తు చేస్తూ వైసిపి విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను నాయకుల సమక్షంలో స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు. గిరిధర్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు..

భాస్కర్‌రెడ్డిని పరామర్శించిన తులసిరెడ్డి

తొండూరు : మండలంలోని కృష్ణంగారిపల్లెకు చెందిన పల్లేటి విజయభాస్కర్‌రెడ్డిని శనివారం పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పరామర్శించారు. భాస్కర్‌రెడ్డి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకొని ఇంటికి తిరిగి రావడంతో విషయం తెలుసుకునన తులసిరెడ్డి ఆయన ఇంటికెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వినయ్ ఉన్నారు. భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు పార్టీ, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పోర్టల్లో వివరాలను నమోదు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి ఒక్కరూ స్వర్ణ పంచాయతీ పోర్టల్లో వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని డిపిఒ రాజ్యలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వేంపల్లె గ్రామ పంచాయతీ వివరాలను నమోదు చేయడంలో వెనుకబడి ఉందన్నారు. వివరాలను నమోదు చేసేందుకు 10 మంది కమిటీ సభ్యులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్లో ఇంటి యాజమానులు తమ వివరాలను నమోదు చేసుకొంటే ఇంటి పన్నులు, నీటి పన్నులకు సంబంధించి ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఇంటి వద్ద నుంచే ఇంటి యాజమానులు ఇంటి పన్నులు, నీటి పన్నులతోపాటు ఇతర పన్నులు చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందని, సిబ్బంది బాగా పని చేయాలని ఆదేశించారు. పంచాయతీకి త్వరలోనే కార్యదర్శిని నియమించి సిబ్బందికి జీతాలు ఇస్తామని చెప్పారు.

స్వర్ణ పోర్టల్‌పై సమీక్షిస్తున్న డిఎల్‌పిఒ రాజ్యలక్ష్మి

కార్యక్రమంలో జమ్మలమడుగు డిఎల్‌పిఒ రమణారెడ్డి, ఇఒలు నాగభూషణం రెడ్డి, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విమాన ప్రయాణానికి విద్యార్థులు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఉచిత విమాన ప్రయాణానికి మండలంలోని అన్ని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు శనివారం హిమకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అర్హత పరీక్ష నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ సాధించిన విద్యార్థులను ఈ ఏడాది శ్రీలంకకు పంపిస్తానని తెలిపారు. వీరి కేర్ టేకర్స్‌గా బాలికల తరుపున ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, బాలుర తరుపున ఇంగ్లీష్ టీచర్ బాల వెంకటరెడ్డి వెళతారని తెలిపారు. హిమకుంట్ల జడ్పీ హైస్కూల్ నుంచి 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. రావులకొలను, కోవరంగుట్టపల్లి, బలపనూరు, అంకాలమ్మ గూడూరు, సింహాద్రిపురం, కస్తూర్బా, గురజాల జడ్పీ హైస్కూలు నుండి ఒకొక్కరికి అవకాశం కల్పించామన్నారు. వీరందరికి పాస్‌పోర్ట్, ఇతరత్రా అన్ని ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశం ప్రతి సంవత్సరం హిమకుంట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులకే ఉండేదన్నారు. విమాన ప్రయాణానికి ఖర్చులు తమ సన్నిహితులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు కొంత డొనేట్ చేయగా, మిగిలిన మొత్తం తన కుటుంబ సభ్యులు వెచ్చించనున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులు విదేశీ విమాన ప్రయాణం చేయడం వల్ల వారి విద్య అభ్యున్నతికి దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతులు ప్రకృతి వ్యవసాయానికి మారాలి

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణ రెడ్డి సూచించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం ఎడి రామమోహన్ రెడ్డి అధ్యక్షతన అన్నదాత సుఖీభవ సిఎం కిసాన్ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డిపిఎం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఎమ్మెల్యే, ఆర్‌డిఒ, టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రభుత్వ అధికారులు పరిశీలించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం రైతుకు రూ.13,500 ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.20, 000 రైతుకు ఇవ్వనుందన్నారు. ఇందులో భాగంగా శనివారం అన్నదాత సుఖీభవ కింద మొదటి విడతగా రూ.7,000 వేశామన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల నేల ఆరోగ్యంతోపాటు మనిషి ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. అనంతరం డిపిఎం ప్రవీణ్‌కుమార్, ఆర్‌డిఒ సాయిశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి అనేక రకాల ప్రోత్సాహాలు ఇస్తున్నాయన్నారు. ఆ మేరకు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపునకు మారాలని కోరారు. భూపేష్ సుబ్బరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ తుమ్మలూరు శ్రీనివాసులు, ఎడి రామ్మోహన్ రెడ్డి రైతులకు సూచనలు చేశారు. చివరగా నియోజకవర్గంలోని 35,184 మంది రైతులకు రూ.24 కోట్ల 11 లక్షల అన్నదాత సుఖీభవ పథకం కింద విడుదల చేశారు. జమ్మలమడుగు మండలంలో 4,554 మంది రైతులకు రూ.3.12 కోట్లు, కొండాపురంలో 5,480 మందికి రూ.3.80 కోట్లు, ముద్దనూరులో 5,748 మందికి రూ.4.00 కోట్లు, మైలవరంలో 6,261 మందికి రూ.4.21 కోట్లు, పెద్దముడియంలో 7,542 మందికి రూ.5.15 కోట్లు, ఎర్రగుంట్లలో 5,597 మంది రైతులకు రూ.3.84 కోట్లు రైతులకు వారి ఖాతాలో వేశారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - వేముల

స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంయుక్తంగా సమీక్ష సమావేశాన్ని వెలుగు ఎపిఎం ఆంజనేయులు, మండల ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు అనే నినాదంతో జీవ ఎరువులు, కషాయాల తయారీపై మహిళా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యవసాయానికి అనుబంధ రంగాలైన పెరటి కోళ్ల పెంపకం, షెడ్ నెట్ ద్వారా కూరగాయల సాగు చేయడం, మేకలు పెంపకం, గొర్రెలు పెంపకం పాడి పశువుల కొనుగోలు ప్రోత్సహించాలని, డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. డ్వాక్రా మహిళలు ఇంటికి కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని కూరగాయలు పండించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలో సామూహికంగా పెద్ద ఎత్తున కిచెన్ గార్డెన్ యూనిట్స్ గ్రౌండింగ్ చేయాలన్నారు. అనంతరం దుగ్గన్నగారిపల్లె ప్రకృతి వ్యవసాయం మహిళా రైతు లక్ష్మీదేవి పండించిన ఆకుకూరలు చుక్కకూర, గోంగూర, మొటిక కూరగాయలను వెలుగు సిబ్బంది కొనుగోలు చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు బాసటగా ప్రతి ఒక్కరూ వారి ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు నాగేశ్వరి, జ్యోతి, జైపాల్, యూనిట్ ఇన్‌ఛార్జిలు వెంకటేష్, రామమోహన్ నాయుడు, ఆంజన్‌రెడ్డి, చిన్నరెడ్డి, ప్రకృతి వ్యవసాయ ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పాఠశాలలోని మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులను మినహా ఎవరిని అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను ప్రజాస్వామిక హక్కులను హరించేలా ఉన్నాయని, వెనక్కి తీసుకోవాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల విద్యా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల మూలంగా విద్యార్థుల తమ స్వేచ్ఛను కోల్పోతారని అన్నారు. ఇది విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు తెలియజేసేందుకు వెళ్లిన వారికి ఇతరుల ద్వారా అనుమతులు ఉండబోవని, దీని ద్వారా విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండా చేసే ప్రయత్నమేనని అర్థమవుతోందన్నారు. ఇలాంటి వైఖరి సరెంది కాదన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంఘాలతో సంప్రదింపులు జరిపేవారిని వారి పాత్రను గుర్తు చేశారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఇకనుండి ప్రయివేట్ వారి వ్యాపారం, అన్యాయాలను బయటకు తీసే అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారి దోపిడీ పెంచుకునేందుకు దోహదపడుతుందని, ఇది ప్రజాస్వామ్య స్వేచ్ఛను హరించేలా ఉందన్నారు. తక్షణమే ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తు న్నామన్నారు.

ప్రాణాలు ముఖ్యం..మత్తు జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రయాణికుల ప్రాణాలు ముఖ్యం.. మత్తు జోలికి వెళ్లొద్దు అని ఆటోడ్రైవర్‌లకు పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవల్లి సూచించారు. స్థానిక సిఎస్‌ఐ చర్చి మైదానంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆటో డ్రైవర్‌లకు నిర్వ హిం చిన మాదక ద్రవ్యాల నివారణపై అవ గాహనా కార్యక్రమంలో హాజీవల్లి మాట్లాడుతూ ఒక్క ఆటోడ్రైవర్ చేతిలో కొంతమంది ప్రయాణికుల ప్రా ణాలు ఉన్నాయని, అలాగే ఇంటి వద్ద నీకోసం నీ కుటుంబం ఎదురు చూస్తూ ఉం టుందనే విషయం అనుక్షణం మదిలో పెట్టుకోవాలన్నారు. కొన్ని సమయాల్లో మానసిక, శారీరక ఒత్తిడి అని పించినప్పుడు మత్తు పానీ యల మార్గం ఎంచు కోవద్దని, ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కాలక్షేపంగా తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజలకు గమనించేందుకు మత్తు వల్ల జరిగే అనర్థాలతో కూడిన పోస్టర్‌లు ఆటోలకు అతికించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్‌లు, సేవాసమితి సభ్యులు చాంద్ బాషా పాల్గొన్నారు.

ఆటోలకు స్టిక్కర్ అంటిస్తున్న సిఐ హాజీవల్లి

ఆచార్య గంగశెట్టి మృతి సాహితీ లోకానికి తీరనిలోటు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రముఖ సాహిత్య విమర్శకుడు, కవి, ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ మృతి సాహితీ లోకానికి తీరనిలోటని కడప జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గంగిశెట్టి లక్ష్మీనారాయణ అనంతపురం జిల్లాలోని పరికల్లు గ్రామంలో జన్మించారన్నారు. ఉన్నత విద్యాభ్యాసం చేసి తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయనం విభాగం ఆచార్యుడిగా పనిచేశారని అన్నారు. ఆ కాలంలోనే నందమూరి లక్ష్మీపార్వతి ఆయన దగ్గర పరిశోధన చేసిందని గుర్తు చేశారు. లక్ష్మీనారాయణ గావించిన కన్నడ అనువాదం గ్రంథానికి 2004లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. విశ్వనాథ సత్యనారాయణ కావ్యానందం కావ్య రచనను కన్నడించారు. అనేక పరిశోధన వ్యాసాలు రాసి గ్రంథస్తం చేశారు. వారు అమెరికా నుండి సిరికోన సాహితీ అనే సాహిత్య సంస్థ ద్వారా అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రొద్దుటూరుకు రెండు పర్యాయాలు వచ్చారని జింకా సుబ్రమణ్యం గుర్తు చేసుకున్నారు. అమెరికాలోని కుమారుని స్వగృహంలో అంత్యక్రియలు జరుగుతాయని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ నివాళులర్పించారు.

ఏటూరు కాలువలో వేగం పుంజుకున్న నీటి ప్రవాహం

ఏటూరు కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం పెంపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఖాజీపేట

కెసి కెనాల్ ఆయకట్టుకు సంబంధించి ఏటూరు ఉప కాలువకు నీటి ప్రవాహ సామర్థ్యాన్ని ఆ శాఖ అధికారులు పెంచారు. ఈనెల 1న 'సాగునీటి కోసం కెసి రైతుల ఎదురుచూపులు' అనే కథనం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైంది. ఇందుకు నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఏటూరు ఉప కాలువ పర్యవేక్షక ఇంజినీర్ గురుమోహన్ రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు బొగ్గుల చంద్ర ఓబుల్‌రెడ్డి, నీటి సంఘం నాయకులు సత్యవేమారెడ్డి, మూల శ్రీనివాసులరెడ్డి స్పందించి నీటి ప్రవాహ వేగాన్ని పెంచారు. ఏటూరు చివరి ఆయకట్టు వరకు సాగునీటి ప్రవాహానికి ఇబ్బంది లేదని తెలిపారు. కాలువలలో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. కాలువలో పిచ్చి మొక్కలు ఉంటే తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎగువ ప్రాంత రైతులు నారుమల్ల తయారీ పనుల వల్ల నీటి ప్రవాహ జోరు తగ్గిందని వివరించారు. సాగునీటి కోసం రైతులు ఆందోళన అవసరం లేద న్నారు. కాలువల వెంబడి నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందుతుం దని మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర తెలిపారు. శనివారం వని పెంట కెవికె ప్రధాన శాస్త్రవేత్త బాలకృష్ణ ఆధ్వర్యంలో పిఎం కిసాన్ సమ్మన్ నిధి అన్నదాత సుఖీభవ పథకం 20వ విడత విడుదల కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మైదు కూరు మండలంలో 8,002 మందికి, బ్రహ్మంగారి మఠంలో 5,862, చాపాడు 6,157, ఖాజీపేట 6,989, దువ్వూరు 7,071 మంది రైతులు లబ్ధి పొందారని ఆయన వివరించరు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశి భూషణ్, ఎడిఎ కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు బిపి ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు. **చాపాడు లో..** పల్లవోలు రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి దేవీ పద్మలత ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని రైతులకు వినిపించారు. ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమాకుమారి, ఎఇఒ స్వప్న, విఎఎ సుష్మా, మాజీ సర్పంచ్ రామ్మోహన్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దిగుబడి సాధించే పంటలను రైతులు సాగు చేయాలి

- డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి నిధి కింద అదనపు సహాయం చేసే నిధులతో దిగుబడి సాధించే పంటలను రైతులు సాగు చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఉన్న వైఎస్‌ఆర్ సభా భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పిఎం కిసాన్ నిధులు ప్రారంభం కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా 41,980 మంది రైతులకు రూ.7 కోట్ల 78 లక్షలు నిధులు రైతుల ఖాతాలో జమ అయిందన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా 41,980 మంది రైతులకు దాదాపు రూ.21 కోట్ల జమ అయినట్లు తెలిపారు. పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా రూ.28 కోట్ల 78 లక్షలు రైతుల బ్యాంకు అకౌంట్‌లోకి నేరుగా జమ అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో పులివెందుల వ్యవసాయ శాఖ ఎడి ప్రభాకర్ రెడ్డి, తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎఒ శివశంకర్‌రెడ్డి మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి రమణారెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకరణాల కోసం 4న స్క్రీనింగ్ శిబిరాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలోని విభిన్నప్రతిభావంతులు, 60 ఏళ్లు దాటిన వారికి వివిధ రకాల సహాయ పరికరాలు అందించేందుకు అవసరమైన స్క్రీనింగ్ శిబిరం ఈనెల 4న సోమవారం ఏర్పాటు చేసినట్లు, అర్హులైన వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల వారీగా ఉదయం 9 గంటలకు వేంపల్లి, చక్రాయపేట మండలాల వారికి వేంపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్లో, సింహాద్రిపురం, లింగాల మండలాలకు ఉదయం ఆయా జిల్లాపరిషత్ హైస్కూళ్లలో, అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు పులివెందుల మున్సిపాలిటీ, రూరల్, వేముల మండలం, పులివెందుల పట్టణం, నాలుగురోడ్ల గాంధీ సర్కిల్ దగ్గరగల అహోబిలపురం ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, తొండూరు, వీరపునాయునిపల్లె జిల్లా పరిషత్ హైస్కూళ్లలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేశామన్నారు. ఆయా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 92473 39815 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పనివేళల్లో కార్యాలయానికి తాళాలు వేయడం దారుణం

వేంపల్లె : వర్కింగ్ సమయంలో విద్యాశాఖ కార్యాలయానికి అధికారులు తాళాలు వేసి ఉంచడం దారుణమని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ పేర్కొన్నారు. శనివారం వేంపల్లె మండల విద్యాశాఖ కార్యాలయం వద్దకు ఆర్‌ఎస్‌ఒ నాయకులు వెళ్లగా తాళాలు తీయకపోవడంతో ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఎంఇఒ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి డ్యూటీకి డుమ్మా కొడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ లేకుండా ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణం ఎంఇఒపై డిఇఒ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయ వేళల్లో తాళాలు వేసిన సిబ్బందిని, ఎంఇఒను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఒ నాయకులు నాయక్, దిలీప్, బాషా పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: KADAPA

E.P. No. 132 of 2024 in
O.S.No. 1122 of 2022

Between
Smt. Ramaiahgari Madhavi ...**Petitioner/D.Hr.**
Vs
Yerraguntla Rama Subba Reddy having died his legal heirs i.e.,.
Respondents No. 1 to 3.
2. Yerraguntla Obul Reddy, Son of late Y. Rama Subba Reddy, aged about 32 years, Hindu, Business, resident of Mohan Residency, Plot No. 409, ITI Circle, Beside State Bank of India, Kadapa City and District.
3. Yerraguntla Srikanth Reddy, Son of late Y. Rama Subba Reddy, aged about 29 years, Hindu, Soft-ware, resident of D.No. 445/197-11, Balaji Nagar, Kadapa City and District.
...**Respondents/J.Drs.**

ప్రతివాదులు 2,3 కి నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా ప్రతివాదులు 2, 3 హాజరు నిమిత్తము తేదీ. 01-09-2025 ఉదయం. 10.30 గంటలకు పై కోర్టు నందు వాయిదా కలదు. మీ హాజరు కొరకు వాయిదా వున్నది. కావున స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
యం. సురేష్ కుమార్
అద్వకేటు, కడప
సెల్: 8500271919

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కడప

O.S. NO: 600/2021

కే, రామాంజనేయులు, తండ్రి రామచంద్ర, వయసు సుమారు 38 సం.లు, వృత్తి వ్యవసాయం, హిందూ, కొమ్మువారి పల్లి గ్రామం, సి.కే దిన్నె మండలం, కడప జిల్లా.
...వాది

మరియు

1 . వి. పద్మావతి, భర్త లేట్ వెంకటరామి రెడ్డి, వయసు సుమారు 55 సం.లు, హిందూ, హౌస్ వైఫ్.
2.వి. శైలజ, తండ్రి లేట్ వెంకటరామి రెడ్డి, వయసు సుమారు 35 సం.లు, హిందూ.
3. వి. స్వాతి, తండ్రి లేట్ వెంకటరామి రెడ్డి, వయసు సుమారు 32 సం.లు, హిందూ.
4. వి. ప్రవలిక, తండ్రి లేట్ వెంకటరామి రెడ్డి, వయసు సుమారు 30 సం.లు, హిందూ.
అందరి నివాసం డోర్ నెంబర్ 13/563-6, మైదుకూర్ టౌన్, కడప జిల్లా.
...ప్రతివాదులు

నోటీసు

పై కేసు లోని వాది తనకు రావలసిన ప్రామీసరి బాపతు మొత్తం ను మీ దగ్గరనుండి రాబట్టుకోనుటకు గాను పై నెంబర్ దావా ను దాఖలు చేసినందున ఇందు విషమమై మీకు ఆక్షేపణ యున్నా యెడల పై కోర్టులో 22.08.2025 వ తేదిన ఉదయం 10.30 ని॥లకు ఖుద్దున గాని, వకీలు ద్వార గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోనవలెను, లేని ఎడల సదరు విషయమై పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదరని తెలియజేయడమైనది.

//కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు//
ఎం. నాగిరెడ్డి, B.Com.,B.L.,
వాది తరపున న్యాయవాది, కడప.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కడప

O.S. NO: 594/2021

ఎం. శ్రీనివాసులు రెడ్డి, తండ్రి ఎల్లా రెడ్డి, వయసు సుమారు 48 సం.లు, వృత్తి వ్యవసాయం, హిందూ, కొప్పోలు గ్రామం, వల్లూర్ మండలం, కడప జిల్లా.
...వాది

మరియు

1 . వి. పద్మావతి, భర్త లేట్ వెంకటరామి రెడ్డి, వయసు సుమారు 55 సం.లు, హిందూ, హౌస్ వైఫ్.
2.వి. శైలజ, తండ్రి లేట్ వెంకటరామి రెడ్డి, వయసు సుమారు 35 సం.లు, హిందూ.
3. వి. స్వాతి, తండ్రి లేట్ వెంకటరామి రెడ్డి, వయసు సుమారు 32 సం.లు, హిందూ.
4. వి. ప్రవలిక, తండ్రి లేట్ వెంకటరామి రెడ్డి, వయసు సుమారు 30 సం.లు, హిందూ.
అందరి నివాసం డోర్ నెంబర్ 13/563-6, మైదుకూర్ టౌన్, కడప జిల్లా.
...ప్రతివాదులు

నోటీసు

పై కేసు లోని వాది తనకు రావలసిన ప్రామీసరి బాపతు మొత్తం ను మీ దగ్గరనుండి రాబట్టుకోనుటకు గాను పై నెంబర్ దావా ను దాఖలు చేసినందున ఇందు విషమమై మీకు ఆక్షేపణ యున్నా యెడల పై కోర్టులో 22.08.2025 వ తేదిన ఉదయం 10.30 ని॥లకు ఖుద్దున గాని, వకీలు ద్వార గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోనవలెను, లేని ఎడల సదరు విషయమై పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదరని తెలియజేయడమైనది.

//కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు//
ఎం. నాగిరెడ్డి, B.Com.,B.L.,
వాది తరపున న్యాయవాది, కడప.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT PRODDATUR

I.A.No. 922/2019 &
O.S.No. 416/2019

Sadhu Siva Sankaraiah, S/o S.Venkataiah, aged 61 years, Hindu, Business, Residing at D.No.2/239/1, Beside SBI Colony, Dorasanipalle (Vill& Post), Proddatur (Mandal), Kadapa Dist.
...**Petitioner/Plaintiff**
Vs
Reddy Bramham, Died his Lrs 1. Reddy Rukmini Devi (wife), 2. Reddy Praveen (Son), 3. Reddy Harika (Daughter) all are residing at D.No.26/884-6, Upstair, Guruvaiahthota, Near Putta Street Motu, Proddatur Town, Kadapa Dist.
...**Respondents/Defendants**

ప్రతివాదులకు దావా సమను &
I.A.NO.922/2019లో నోటీసు

పై నెంబరు దావాలోని వాది రాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రెడ్డి బ్రహ్మం వ్రాయించిన ప్రామిసరీ నోటు బాకిని గురించి అతని భార్య మరియు కుమారుడు, కుమార్తె అయిన మీ పైన రూ.1,71,450/-లు వసూలుకు గాను దావా దాఖలు చేసి ఉన్నాడు. ఇందులోనే రెడ్డి బ్రహ్మం తాలూకు Earned Leaves మొత్తంను దావా తీర్పుకు ముందే జప్తు కోరి I.A.No.922/2019 పిటీషన్‌ను దాఖలు చేసినాడు. పై దావా మరియు I.A.లో 06.08.2025వ తేదీ పగలు గం॥10.30 ని॥లకు వాయిదా ఉన్నది. పై తెలిపిన కోర్టుకు మీరు ఖుద్దున గాని, లాయరు ద్వారా గాని హాజరై అభ్యంతరాలు తెలుపుకొనవలెను. అటు లేని పక్షంలో మీరు పరోక్షముగా తీర్మాణించబడుదురు.

//By Order of the Court//
M. SURESH BABU, B.A.,LL.B.,
Advocate, PRODDATUR.